'రచన' మాసపత్రిక - ఫిబ్రవరి 1992

## కథ ప్రహేళిక -3



# మురద

పళ్ళతో పమిటను పట్టుకుని రవిక హుక్సు తీయసాగింది సీత.

"వద్దు వద్దు" అన్నాడు కంగారుగా మురళి.

ఒక్కమారు మురళిని పరిశీలించింది. బొద్దుగా వున్నాడు. గుండ్రటి మొహం. నుదుటన చిన్న బొట్టు. చెవికి పోగు, మధ్యకి తీసిన పాపిడి - జుత్తు కురచగా వుంది.

"ఏంటీ" ఆవులించింది.

మురళి పక్కనే ఉంచిన సంచీ తీసి జిప్ తెరిచాడు.

'తప్పుడు లం....కొడకా!' అన్న తిట్టూ, దానితో బాటు పెద్దగా దగ్గూ వినిపించసాగాయి.

మురళి గాభరాగా పక్కనున్న గోడ వయిపు చూసాడు. దానికొక తలుపు వుంది. తలుపు అవతలనించి వస్తోందా దగ్గు.

మురళి గబగబా సీత దగ్గరకు వెళ్ళాడు.

"ఎవరదీ?" అన్నాడు గొంతు తగ్గించి.

సీత మూసుకుపోతున్న కళ్ళను విప్పలేదు.

మరోమారు అడిగాడు మురళి.

"మా నాన్న" అంది. అన్నాక గొంతు పెంచి, "పడుకో నాన్నా" అని అరిచింది.

మురళికి ఒళ్ళంతా చెమటలు పోసినట్లయింది.

సీత ముఖం చిట్లించి, "అస్మా! నిద్ర పట్టదు" అంది.

మురళి ఆ తలుపు వేపు చూస్తూ ఉండిపోయాడు.

వివిన మూర్తి

"రా!" చెయ్యి పట్టుకోబోయింది.

చటుక్కున వెనక్కి తగ్గాడు మురళి.

"కొంచెం పనుంది" అన్నాడు.

"ఏం పని-"

"పూజ చేసుకోవాలి" నసిగాడు.

సీత కళ్ళు విప్పి అతన్ని చూసింది. తల అటూ ఇటూ ఆడించింది.

"కళ్ళుమూసుకుంటానంతే! నిద్రలేపు" అంది. మురళి ఏమీ అనకుండానే ఓ పక్కకి తిరిగి పడుకుంది. పడుకున్న సీతను కళ్ళార్పకుండా చూసాడు మురళి. చామనఛాయ. ముహం కోలగా ఉంది. నవ్వినప్పుడు, మాట్లాడినప్పుడు పన్ను మీద పన్ను ప్రత్యేకంగా ఉంది. మురళి చూపులు ముఖం మీంచి శరీరం వయిపు కదిలాయి!

చటుక్కున కదిలాడు. జిప్ తెరిచిన సంచీ లోంచి ఒక పటం తీశాడు. రాములవారి పట్టాభిషేక దృశ్యముంది. అందులో రామన్న, సీతమ్మ సింహాసనం మీద కూర్చుని ఉన్నారు. వారి పాదాల వద్ద హనుమంతుడు. వింజామరలతో, ఛత్ర చామరాలతో తమ్ములు ముగ్గురూ నించునున్నారు.

మురళి ఆ ఫోటోను ఈశాన్యం చూసుకుని ఆ మూల నుంచాడు. దాని ముందు ఆసన శుద్ధిగా కూర్చున్నాడు. ఒక అరటిపండును ముందుంచి అగరవత్తులు గుచ్చాడు. అగ్గిపెట్టె లేదు. జేబులు తడుముకున్నాడు. సంచీలో వెతికాడు.

"ఏమండీ" మంచం మీద పడుకున్న సీతను సమీపించి పిలిచాడు. ఆమె గాఢనిద్రలో ఉంది. మురళి గొంతు తగ్గించి మళ్ళీ పిలిచాడు.

"తప్పుడు లం.....కొడకా!" పెద్ద గొంతుతో మళ్ళీ దగ్గు ప్రారంభమైంది.

తలుపు వయిపు చూసాడు. దగ్గు తెర విడటం లేదు. పక్క గదిలో లైటు వెలుగుతున్నట్లు కూడా లేదు. మరే అలికిడీలేదు.

మురళి తలుపు వయిపు కదిలాడు. గడియ ఇటే వేసి ఉంది. ఒకటి రెండు నిముషాల తర్వాత కొంచెం సర్దుకుంది దగ్గు. మురళి మళ్ళీ సీత వయిపు చూసాడు. అంత దగ్గు శబ్దమూ ఆమెకు నిద్రాభంగం కలిగించలేదు. చుట్టూ చూసాడు.

చిన్న గది. ఒక చిన్న కిటికీ రెక్కలు మూసి ఉంది. మూడు తలుపులున్నాయి. ఒక అల్మారా ఉంది. వెళ్ళి చెక్క తలుపులు తీసాడు. అరలు అపరిశుభ్రంగా ఖాళీగా ఉన్నాయి. గదిలో ఒక మంచం తప్ప ఏమీ లేదు.

తను వచ్చిన తలుపు కాకుండా రెండో తలుపు తీసాడు. స్నానాల గదిలా ఉంది. బకెట్‌తో నీరు, చెంబు, సబ్బు ఉన్నాయి. మళ్ళీ లైట్ ఆర్పి తలుపు జారేశాడు. సీత

నిద్రపోతూనే ఉంది. తక్కువ కాంతి బల్బు.

మురళి ఆమెను పరిశీలించాడు.

చటుక్కున బుర్ర విదల్చుకుని తను వచ్చిన తలుపు తెరుచుకుని బయటకు వచ్చాడు.

రాత్రి పదకొండు దాటింది. బయట అరుగు మీద ఎవరూ లేదు.

వీధిలోకి వచ్చాడు.



మురళి రెండు అడుగులు వేసే సరికి - "ఏంటి బ్రదర్" అంటూ జోగారావు పక్కనుంచి వచ్చాడు.

"అగ్గిపెట్టి కావాలి"

అతన్ని విచిత్రంగా చూసి కళ్ళెగరేసాడు జోగారావు.

"ఎందుకూ?"

"పనుందండి" అన్నాడు.

"ఆ సందులో కిళ్ళీబడ్డీ ఉంటుంది" అన్నాడు జోగారావు.

మురళి అటు నడిచాడు.

జోగారావు జారేసిన తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాడు. పడుకున్న సీతను సమీపించాడు.

"లేవవే లంజా" అంటూ నొక్కాడు.

సీత లేచి అయోమయంగా చూసింది.

జోగారావు నవ్వుతూ - "మహారాణిలా తొంగున్నావు! రాత్రంతకీ డబ్బులు దొబ్బిందిందుకా!- నీ బాబుగారి సొమ్మనుకున్నావా?" అన్నాడు.

అతని చేతిని తన శరీరం మీంచి తీసేసి పమిట సర్దుకుంది.

"నీ బాబుగారి సొమ్ము కాదు కదా!"

"పళ్ళు రాలిపోగలవ్"

"రాలగొట్టు చూస్తాను. డబ్బులు ఆ కుర్రోడివి - తొంగోడం నీ దగ్గరానా?"

"అతనేం చేస్తాడు?"

"నువ్వేం చేస్తావో - అదే!"

"వాడికి స్టార్టింగ్ ట్రబుల్"

"నువ్వేం ట్రైలు వేసావా?"

"నీ నోరు ఎక్కువవుతోంది. నాక్కోపం తెప్పించకు"

జోగారావు, సీతా ఒకళ్ళనొకళ్ళు చూపుల్తో కాల్చేసుకున్నారు.

జోగారావు తనని తాను అణుచుకుంటూ అన్నాడు -

"ఈ అబ్బాయికి డాక్‌యార్డ్‌లో పని. విశాఖపట్టణం. మంచాడు. మా ఫ్రెండ్ సోంబాబుకి క్లోజ్. నాకు అప్పుజెప్పాడని ముందే చెప్పాన్నీకు. వాడిని బెదర గొట్టకు అని. నా లాంటి బేరం కాదు" అన్నాడు వీలయినంత సౌమ్యంగా.

"తెలుస్తూనే ఉంది."

జోగారావు మాట్లాడలేదు.

సీత తలూపి, "నేనూ మనిషినే! ఎవరెలాంటాళ్ళో నాకూ తెలుసు" అంది.

"మీ లంజల్ని నమ్మకూడదు. నేనయితే ఈ పాటికి - నిన్ను..."

"నీలాంటి లంజాకొడుకుల్ని అసలు నమ్మకూడదు"

ఆమె మాట పూర్తవలేదు. జోగారావు చటుక్కున కదిలాడు. ఆమె జుత్తు అందుకో బోయాడు. ఆవిడ వంగి తప్పుకుంది. మరో అంగ వేసి ఆమెను అందుకోబోయాడు. సీత దొరకలేదు.

పక్క గదిలోంచి దగ్గు మొదలయింది.

జోగారావు కంగారుగా అటు చూసాడు.

"ఎవరది?" అన్నాడు.

"నీలాంటోళ్ళ కోసం నన్ను కన్నోడు" అంది దూరంగా నిలబడి.

జోగారావు అటే చూస్తున్నాడు. దగ్గు తెర వదలటం లేదు. సీత తలుపులు తీసుకువెళ్ళింది. వెనకే తలుపు జారేసింది.

జోగారావు సిగరెట్టు తీసి వెలిగించాడు. మంచం మీద కూర్చున్నాడు. మురళి తెరిచున్న తలుపుల్లోంచి లోపలికి వచ్చాడు. జోగారావు చేతిలోని సిగరెట్టు మీదే దృష్టి నిలిపాడు.

"అగ్గిపెట్టె లేదన్నారు" అన్నాడు.

జోగారావు నిస్సంకోచంగా నవ్వాడు - "మరిచిపోయాను"

మురళి అపనమ్మకంగా చూసాడు.

జోగారావు లేచి అతన్ని సమీపించి భుజం తట్టాడు.

"కరోడా లంజ జాగ్రత్త. టోకరా ఇస్తుంది"

"చాల మంచావిడని సోంబాబు చెప్పాడండీ" - గతుక్కుమంటున్నట్లు చూసాడు మురళి.

టీజింగ్ చేస్తున్నట్లు అన్నాడు జోగారావు.

"మంచిదేలే! రోగాలు లేవు. ఇప్పుడిప్పుడే దుకాణం పెట్టింది. సరిగా ఉండకపోతే నాతో చెబుతాననండి!"

మురళి తలాడించాడు.

"పక్క గదిలో బాబుని పడుకోబెట్టి, మనల్ని పక్కలో వేసుకునే జగజ్జంత్రీ! ఇలాంటోళ్లకి దెబ్బంటేనే జడుపు. నా పేరు చెబితే చాలు మీరు చెప్పినట్లు వింటుంది"

మురళి నోరు పెగిలింది.

"మనం ...మనం...వెళ్ళిపోదాం"

జోగారావు మరోమారు భుజం నొక్కాడు.

"వంద ఇచ్చాం - పావలా కూడా ఇవ్వదు"

మురళి తన సంచీ అందుకున్నాడు.

దగ్గు తెర విడింది. 'పడుకో' అన్న సీత స్వరం వినిపించింది.

"ఛీ - పాపిష్టి ముండాకొడకా.." అన్న కేకా, మంచం మీద కదలిన చప్పుడూ వినిపించాయి.

జోగారావు మురళి చెయ్యి పట్టుకున్నాడు.

"సోంబాబు ఫీలవుతాడు" అని, "సీతా!" అంటూ పిలిచాడు.

సీత తలుపు తెరచుకుని వచ్చి తలుపు మూసింది.

"ఎందుకలా అరుస్తావ్! నాన్న లేస్తే మళ్ళీ దగ్గుతాడు" అంది. మంచం మీద కూర్చుని ఆవులించింది.

పళ్ళు నూరాడు జోగారావు. మురళి వయిపు చూసి నవ్వాడు.

"నేను వెళ్తున్నాను. మీరుండండి. భయపడకండి"

తలుపు ధడాలున మూసాడు.

మురళి సంచితో మంచం పట్టీ మీద కూర్చున్నాడు.

సీత కొంతసేపటిదాకా కళ్ళు మూసుకుంది. చటుక్కున మెలకువ వచ్చింది. కళ్ళు నులుముకుంటూ దిగ్గున లేచింది. తల వాల్చుకుని కూర్చునున్నాడు మురళి. అతనికి దగ్గరగా జరిగి భుజం మీద చెయ్యి వెయ్యబోయింది. మురళి చురుగ్గా లేచి నించున్నాడు.

"ఏం - ?" అంది.

"వెళ్ళిపోతాను" అన్నాడు.

"మీ డబ్బులు?"

ఆమె వయిపు చూసాడు.

"ఖర్చయిపోయాయి"

"ఫరవాలేదులెండి" అన్నాడు సంచిలో పటాన్ని పెట్టుకోబోతూ.

సీత అతని దగ్గిరికి వెళ్ళింది.

"నేను నచ్చలేదా?"

"ఆహా! అది కాదు"

"మరి?"

మురళి మాటలాడలేదు. సంచిలో సామాను పెట్టేసుకున్నాడు.

సీత మెల్లగా అంది.

"రేపో ఎల్లుండో ఓసారి ఇటువేపు రండి"

ఎందుకు అన్నట్లు చూసాడు.

"ఏదయినా బేరం దొరికితే మీ డబ్బులు సర్దుతాను"

"అక్కరలేదన్నాను గదండి"

"మీరు ఇప్పుడు వెళితే మీ ఫ్రెండ్ ఊరుకోడు"

"నేనతన్ని తీసుకుపోతాను"

మురళి గొంతు ఆమెకు నమ్మవీలుగా వినిపించలేదు.

"కొంచెం ఆగి వెళ్ళకూడదూ" అంది.

మురళి కదలలేదు.

"నాకూ సిగ్గూ ఎగ్గూ ఉన్నాయి. మీద పడను" అంది.

మరయితే ఎందుకన్నట్లు చూసాడు మురళి.

సీత తల ఓ పక్కకి వాలి ఉంది. ఒత్తయిన జుత్తు. నున్నటి బుగ్గలో కొంత భాగాన్ని కప్పుతూ పరుచుకుని ఉంది. మెడ వంపులో ఓ నరం ఉబ్బి కానవస్తోంది.

మురళి సంచిని అలమారాలో ఉంచాడు. కూర్చోడం కోసం అటూ ఇటూ చూసాడు.

సీత మంచం మీంచి లేచి, "కూర్చోండి" అంది.

మురళి సందేహిస్తూ కూర్చున్నాడు.

సీత సందేహనివృత్తి కోసమన్నట్లు వారనున్న చాప తీసి నేల మీద పరచి కూర్చుని గోడకు ఆనుకుంది.

మురళి స్వేచ్ఛగా కూర్చున్నాడు.

"ఎందుకు ఆగమన్నారు?"

"వంద వదులుకోలేక"

"ఫరవాలేదన్నానుగా!"

"మీకు తెలీదు"

"ఆయనకు నేను చెబుతానన్నానుగా!"

సీత అదోలా నవ్వింది. మురళికి ఆ నవ్వు – నీకు చేతకాదు – అన్నట్లుంది. మురళి కోలుకొని ఏదో అనేలోగా మళ్ళీ దగ్గు మొదలయింది. 'తప్పుదు ముండాకొడకా' అన్నమాట దగ్గుని చీల్చ జూసింది. దగ్గు ఆ మాటని లొంగదీసుకుంది. మురళి అస్థిమితంగా అవతల గది వయిపు చూస్తున్నాడు. సీత అతన్నే పట్టి పట్టి చూసింది. చూపు ఆవిడ వయిపు తిప్పాడు మురళి.

"వెళ్ళండి" అన్నాడు.

"ఎక్కువగా లేదు. తగ్గుతుంది"

అన్నట్టే ఆ దగ్గు తెర తొందరగానే విడింది. మురళి విడుదల దొరికినట్లు చూసాడు.

"ఇంకెవరున్నారక్కడ?"

"ఎవరూ లేరు"

మురళి సందేహాన్ని అర్థం చేసుకున్నట్లు నవ్వింది సీత.

"మా నాన్న దేవుడిని తిడుతున్నాడు"

మురళి సంచిని ఉంచిన అలమరా వైపు అప్రయత్నంగా చూసాడు. సీత చూపు అతన్ని అనుసరించింది.

"అవునూ - మీరిందాకా పటం ఏదో తీసారేంటి?" అంది.

మురళి జవాబియ్యలేదు.

"నేను చూసాను. రాముల వారి పటం. ఇక్కడకొచ్చిన వాళ్ళందరికీ తలో పిచ్చీనూ! మీకూ అలాంటిదే ఏదో..." - సీత మాట పూర్తి చేయలేదు.

మురళి జవాబు కోసం కొంతసేపు చూసింది.

"మీరు అందర్లాంటారు కాదు"

"నిజమే"

నిస్పృహగా నిర్లిప్తంగా సీతకి ఆ స్వరం వినిపించింది.

"ఎందుకో బాధ పడుతున్నారు?" అంది సీత.

ఒక్కసారి మురళిని దుఃఖం కమ్మేసింది. చేతుల్లో ముఖం దాచుకుని అణుచుకోబోయాడు. అతనికి వశమవలేదు. చంటి పిల్లాడిలా ఏడవసాగాడు. సీత ఒక్క ఉదుటున లేచింది. అతన్ని సమీపించింది. మురళి మీద చేయి వేసింది. మురళి ఆవిడ చేతిని పట్టుకుని ముఖం ఆమె చేతికి వేసి రుద్దుకోసాగాడు. "ఏంటయ్యిందండి?" ప్రశ్నిస్తోంది సీత. మురళి ఆవిడ చేతిని వదిలి దూరంగా జరిగాడు. తనను తాను సంబాళించుకున్నాడు. స్థిరంగా అన్నాడు.

"నేను మగాడిని కాదు"

సీత ఏం చేయాలా, ఏం మాట్లాడాలా అన్నట్లు పెదవి కొరుక్కుంది.

మురళి లేచి గబగబా వెళ్ళి తన సంచీ తీసుకున్నాడు. సీత అతని చేయి పట్టుకుంది. మురళి విడిపించుకోబోయాడు. ఆమె పట్టు గట్టిగా లేకపోయినా అతను విడిపించుకోలేక పోయాడు.

"ప్లీజ్..." అన్నాడు.

ఆమె అతన్ని మంచం వద్దకు నడిపించింది.

అతను కూర్చున్నాడు. ఆమె అతని చేయి వదిలింది.

"అయితే ఇక్కడకు ఎందుకు వచ్చారు?"

"మా నాన్నగారూ వాళ్ళూ పెళ్ళి అని చంపేస్తున్నారు పెళ్ళి చేసుకుని మరో వ్యక్తి బ్రతుకు నాశనం చేసే హక్కు నాకు లేదు. అటో ఇటో తేల్చుకుందామని... పరీక్షించుకుందామని... ఫెయిలయితే.." అంటూ ఆగాడు.

సీత మాట తోచనట్టు అతన్ని చూసింది. మురళి తల అటూ ఇటూ ఊపడం ఆపి వెర్రిగా ఆవిడ ముఖంలోకి చూసాడు. ఆ వదనం ఒయాసిస్సో, ఎండమావో తేల్చుకోజూస్తోంది అతని చూపు.

"ఇంతకుముందు ఎవరి దగ్గరయినా ఉన్నారా?"

మురళి జవాబులేదు.

"ఫర్లేదు చెప్పండి"

"మా అత్తయ్య... మా నాన్నగారి చెల్లెలు.."

మురళి చెప్పసాగాడు. ఆరేడేళ్ళ క్రితం జరిగిన సంఘటన పూస గుచ్చినట్లు చెప్పాడు. తెలిసీ తెలియని వయసులో కలిగింది ఆ అనుభవం. అసంతృప్తి చెందిన ఆ నడివయస్కురాలి ఛీత్కారం ఆ యువకుని మనోజీవితాన్ని ఎలా ఛిద్రం చేసిందీ, మురళి చెబుతున్నాడు. అతని చదువు ఎలా చెడినదీ, పరీక్షల్లో ఎలా అత్తెసరు మార్కులు వచ్చినదీ, ఐ.టి.ఐ.తో చదువెలా ముగిసిందీ, ప్రతి రాత్రీ ఆ అనుమానం, ఆ ఆలోచనలు ఎలా ఏడిపించినదీ.... చేతనయిన పద్ధతిలో చెప్పుకుపోతున్నాడు.

"తప్పుడు ముం....డా కొడకా!" దగ్గు మొదలయింది.

సీత అటు చెవులు రిక్కించింది.

మురళి అయోమయంగాచూసాడు.

"ఒక్క నిముషం" అంటూ పరుగెత్తుకు వెళ్ళింది.

ఆవిడ వెళ్ళగానే మురళి మంచం మీద బోర్లా పడుకున్నాడు. తన్నుకు వస్తున్న ఏడుపుతో కదిలిపోతున్నాడు. క్రమంగా దుఃఖం తగ్గింది.

అక్కడ దగ్గు కూడా తగ్గింది.

పది నిముషాలలో తిరిగి వచ్చింది సీత. భుజం మీద చేయి వేసి తట్టింది. మురళి లేచి కూర్చున్నాడు.

"తాగండి" అంది చేతిలోని కప్పు అందిస్తూ.

"ఏంటి?"

"కాఫీ"

మురళి కాఫీ తాగుతూ "థేంక్స్" అన్నాడు. తాగేసి కప్పు ఆమెకి అందించాడు.

ఆవిడ దానిని భద్రపరచి వచ్చింది. చూపులు కదుల్తున్న సీతను అనుకున్నాయి. సీత వచ్చి సమీపంగా నించుని అతని చూపులు ఆమెకు అర్థం అవుతున్నాయి. ఆమె చూపులు అతనికి అర్థం కావడం లేదు.

"నేను పూజ చేసుకుని ఒక్క నిముషంలో వచ్చేస్తాను" అన్నాడు ఆశగా.

సీత పెదాలు బిగించింది. జవాబివ్వలేదు.

"ఏమండీ?"

"సరే! రండి" అంది నిశ్చయానికి వచ్చినట్లు.

అతను ఉత్సాహంతో లేచాడు. చక చకా సంచీ తెరచి పటం ఏర్పాటు చేశాడు. అగరొత్తులు వెలిగించాడు. పటం చుట్టు తిప్పాడు.

పద్మాసనంలో కూర్చుని రెండు చేతులు జోడించాడు. అతని పెదాలు ఏవో శ్లోకాలు చదువుతూ కదులుతున్నాయి.

సీత అతనికి కొంచెం దూరంలో నేల మీద చతికిలపడి అతని చర్యలను పట్టి పట్టి చూస్తోంది. అయిదు నిముషల తర్వాత మురళి లేచి ప్రసాదంగా ఉంచిన అరటిపండుని చెరిసగం చేసి ఇచ్చాడు. ఆమె నోట్లో వేసుకుంది.

"మీరు దేముడిని నమ్ముతారన్నమాట"

"మీరు నమ్మరా?"

అతని ఆశ్చర్యాన్ని గమనించినట్లు నవ్వింది.

"ఇలాంటప్పుడు కూడా - మీకు దేవుడూ?"

"ఇది పవిత్రమైన కార్యం"

ఆశ్చర్యంగా చూసింది.

"సృష్టి జీవధర్మం. సమాగమం సృష్టికి మూలం. కనక సమాగమం పరమ పవిత్రం"

"మీ మాటలు నాకు తెలీటం లేదు గానీ.. ఇంతపెద్ద పెద్ద మాటలు మీరు మాట్లాడతారనుకోలేదు"

"నేను కొంచెం చదువుకున్నాను"

"ఇన్నీ తెలిసీ.." అంటూ ఆగింది.

"చెప్పండి"

"ఫెయిలయితే చచ్చిపోదామనుకుంటున్నారు"

"ఛా! నేనెప్పుడూ చావాలనుకోలేదు. అనుకోను. కానీ... వివాహానికి అర్హుడనో కాదో తేల్చుకోవటం నా కనీస ధర్మం"

"నా వంటి అపవిత్రురాలితోనా తేల్చుకుంటారు?"

"మనుషుల్లో అపవిత్రులు లేరు. చేసే పనుల్లో అపవిత్రత ఉంటుంది. చేయవలసిన పనులే అయినా వాటిని చేసే మార్గాలను బట్టి కూడా పవిత్రమూ, అపవిత్రమూ అవుతాయి"

మురళి మాటలు ఆమెకు అర్థం కాలేదు. సీత లేచి మంచం మీద కూర్చున్న మురళిని సమీపించింది. వజవజ వణుకుతున్న మురళిని గుండెలకు హత్తుకుంది.

అతని హృదయావేశం కట్ట తెంచుకోజూస్తోంది.

శరీరంలో ఏదో జరగాలనుంది. అది జరగదన్న భయం నల్లటి దట్టమైన మబ్బులా వ్యాపించి ఉంది. పట్టపగలే చిమ్మచీకటి అన్న భ్రాంతిని కల్పిస్తోంది.

ఆమె పెనుగాలిలా అతన్ని తాకింది. భయసందేహాలు మేఘాలపై దాడి ప్రారంభమయింది. ఆమె సారథియై నడిపించుతోంది. ఆమెను చుట్టుకుంటున్న అతని చేతులకు ఊహల చిత్రాలు అందీ అందకుండా పోతున్నట్లుంది. ఆవిడ హృదయం పొందుతున్న ఉద్వేగానికీ, శరీరంలోని నిర్వేదానికీ భేదం ఆ యువకునికి అవగతం కావటం లేదు.

"వద్దు" అంది అలసటగా, ఆయాసంగా.

"ఉహుం!" - అతను వినిపించుకోవటం లేదు.

"వద్దు" - మరో ప్రయత్నాన్ని ఆమె మనసారా నిరోధించసాగింది.

"ఏం?"

"నాకు?"

"నీకు...."

"తప్పుడు ముండా కొడకా!" మళ్ళీ మొదలయింది దగ్గు.

చటుక్కున అతన్ని విడిపించుకుంది. బట్టలు చుట్టుకుని పరుగెత్తింది. మురళి తనని తాను చూసుకున్నాడు. అతని మీదకు ఏదో చల్లని గాలి వీస్తున్నట్లుంది. ఎవరో దేవతలు కళ్ళ ముందు నిలిచి కావల్సిన వరాలను నోరు తెరిచి అడగకఉండానే వర్షిస్తున్నట్లుంది. జీవితమంతా దేన్నో వెదికి వెదికి నిరాశలో కృంగిపోతున్న తరుణంలో అదే కాలికి చుట్టుకున్నట్లుంది.

మురళి ఆనందోద్వేగంతో లుంగీ కట్టుకుని వెళ్ళి భగవంతుని ముందు సాష్టాంగ ప్రమాణం చేసాడు.

చెంపలు వేసుకున్నాడు.

దగ్గు ఆగిపోయింది.

సీత రాలేదు.

అసహనంగా ఉంది.

సీత రాలేదు.

ఆరాటంగా ఉంది.

సీత రాలేదు.

మురళి అడుగులు తలుపు వేపు సాగమని పట్టుపడుతున్నాయి. చూపులు తలుపులను బాదుతున్నాయి. రెండోవేపు తలుపు మీద చప్పుడయింది.

"ఎవరు?" అన్నాడు మురళి.

"నేను" - జోగారావు గొంతు.

మురళి వెళ్ళి తలుపు తీసాడు. జోగారావు లోపలికి జొరబడ్డాడు. గుప్పుమంటూ వచ్చింది వాసన.

"థాంక్స్" - ఉద్వేగంగా అన్నాడు మురళి.

"దేనికి?" - అతని చూపులు గదిని వెదుకుతున్నాయి.

"యింత మంచి మనిషిని..." - మాటలు వెతుక్కుంటున్నాడు మురళి.

"ఎన్నిసార్లయిందేంటి బ్రదర్?" కన్ను కొట్టాడు జోగారావు.

మురళికి ఆ మాట అరుచిగా ఉంది.

"యింకా అవలేదు" అన్నాడు బలవంతంగా.

"నాకు తెలుసు - యీ లంజల సంగతి. ఉండు చెబుతాను"

వేగంగా లోపలి తలుపు తోసుకుని అవతలి గదిలోకి వెళ్ళాడు.

మురళి ఊహించని పరిణామం అది.

"లంజా" అంటున్న గొంతూ, "వదలరా" అంటున్న సీత గొంతూ మురళి చెవుల బడ్డాయి.

ఒక్క అంగలో మురళి ఆ గదిలోకి ప్రవేశించాడు.

జోగారావు సీత జుట్టు పట్టుకుని లాగుతున్నాడు. మంచం మీదనున్న గోగి దగ్గుతూనే కదిలిపోతూ అతనికో మరెవరికో చేతులు జోడించుతున్నాడు.

మురళి జోగారావుని సమీపించాడు.

"యీ లంజని నీ దగ్గర పడుకోబెట్టాకనే - మనం యిచ్చిన వందకు రెండొందలు దీన్నుంచి కక్కిస్తాను. కంగారు పడకు బ్రదర్!" - జోగారావు సీతను లాగుతూ అన్నాడు.

"ఆవిడని వదలండి" అన్నాడు మురళి.

"నీకు తెలీదు గురూ!" మురళిని నెట్టేసాడు జోగారావు.

మురళి లేచి కదలి అతన్ని సమీపించే సరికి సీత జుత్తు వదలకుండానే రెండో చేత్తో కుచ్చెళ్ళు పట్టుకున్నాడు.

మురళి జోగారావు భుజం మీద చేయి వేసి వెనక్కి లాగి బలంగా దవడ మీద వాయించాడు. జోగారావు సీతను వదిలేసి, "నీకు పిచ్చెక్కిందా" - ఊగిపోతూ అన్నాడు.

మురళి అతని మెడ పట్టుకుని బయటకు నడిపించాడు. అంతసేపూ జోగారావు మురళి చేతులను విడిపించుకోవటానికి యత్నించాడు. సన్నంగా వున్న ఆ మనిషిని రోడ్డు మీదకు తీసుకురావటానికి మురళికి ఎలాంటి యిబ్బందీ కలగలేదు.

"తిన్నగా యింటికి వెళ్ళు" - అతన్ని వదిలి నిదానంగా చెప్పాడు.

"యింటికి గాదు. పోలీస్‌స్టేషన్‌కి వెళతాను. దీని దుకాణం మూయించేస్తాను. మీ యిద్దర్నీ జీపెక్కిస్తాను" - అరిచాడు జోగారావు.

"నీ యిష్టం వచ్చినట్లు చేసుకో"

మురళి వెనుదిరిగాడు.

వీధరుగు మీద నిలబడి చూస్తోంది సీత. విజయనగరపు వీధిలోని ఆ పొట్టి అరుగుల యింటి ముందు నుంచి ఆ రాత్రి వేళ పోతున్న కొందరు ఆగి చూస్తున్నారు.

మురళి వెనకనే సీత గదిలోకి ప్రవేశించింది. తలుపులు మూసుకున్నాయి.

సీత అతన్ని కావలించుకుని నుదుట ముద్దు పెట్టుకుంది.

"నిన్ను మగాడిని కాదని ఎవరనగలరురా నాకన్నా" అంది.

మురళి ఆమె శరీరం మీద కదుల్తున్నాడు.

"వద్దు"

"ఏం?"

"బురదలోకి అడుగు పెట్టొద్దురా కన్నా! నువ్వు నిస్సందేహంగా మొగాడివి. నిస్సంకోచంగా పెళ్ళాడు. సుఖంగా ఉండు. హాయిగా జీవించు" - అంటోందామె.

మురళిని మెల్లగా విడిపించుకుంది.

"తప్పుడు ముండా కొడకా!" మళ్ళీ మొదలయింది దగ్గు.

మురళిని సాగనంపింది సీత.

వీధరుగు మీద నిలబడి చేయి ఊపుతోంది.

మురళికి అర్థంగాని ఏదో ఉద్వేగంగా ఉంది.

అతని కళ్లలో తడి.

అంతకు మునుపు అలాంటి తడి అతనికి తెలియదు. అది తన గురించి కాదు.

ఆ తడిలో అతనికి ప్రతిచోటా బురద కనిపిస్తోంది.

ఆ రాత్రి వేళ అతను విశాఖపట్నం పోయే బస్సు ఎక్కాడు.

మురళికి బురదతో చేసిన బస్సు బురదని చీల్చుకుని పోతున్నట్లుంది.

## కథాప్రహేళికలో కలం పట్టిన పాఠక మహాశయులకు అభినందనలు!

ఈ శీర్షికలో మూడవ కథ "బురద"పై అభిప్రాయాలను బట్టి నచ్చిన వారికి కథ ఎంతగా నచ్చిందో నచ్చని వారికి అంతగానూ నచ్చలేదు. కథనం, పాత్ర చిత్రణ, కథ ఉద్దేశ్యం, సంభాషణలూ వంటి అంశాలను బట్టి అనేకమందికి యీ కథ నచ్చింది.

'పర్టిక్యులరైజేషన్'నీ, సీత పాత్రలో మెచూరిటీ రంగు పూత సహజత్వానికి దగ్గరగా ఉందా లేదా అన్న డిబేటబుల్ అంశాన్నీ ఎ.వి. రమణమూర్తి (ఢిల్లీ) పట్టుకున్నారు. స్పష్టంగా చెప్పారు. వీరికి ప్రథమ బహుమతి.

'నిజమైన మగతనం గురించి 'బురద' కథ చెప్పజూచిన విషయాన్ని గమనించారు. వల్లూరి తేజస్వి (ఏలూరు). పైకి యాత్రీ కోణం నుంచి డా. యం. విజయగోపాల్ (హైదరాబాద్) తమ అభిప్రాయాన్ని చెప్పారు. వీరిద్దరికీ రెండవ బహుమతులు.

నచ్చని వారిలో ఎక్కువ మందికి - బూతు మాటలు నచ్చలేదు. కథావస్తువులో పాతదనం నచ్చలేదు. నచ్చని అంశమేదో స్పష్టంగా ఎవరూ విశ్లేషించలేకపోయారు.

కథాంశంలో పాతదనాన్నీ, కథాకల్పనలో అసహజత్వాన్నీ తప్పు పట్టిన వి.ఎల్. సుజాత (నరసరావుపేట) అభిప్రాయం బహుమానార్హంగా భావిస్తున్నాం!

మృచ్ఛకటికం, కన్యాశుల్కం వంటి సుప్రసిద్ధ రచనల నుంచి వేశ్యల మంచితనం సాహిత్యంలో ప్రముఖ భాగం. అలాగే తెలుగు కథలలో అధిక శాతం కథలు వేశ్యల మీద వచ్చాయి. ఈ కథలు వ్రాసిన అందరికీ పాఠకుల మనోబలహీనతలు వాడుకోవటమే

ప్రధాన ఉద్దేశ్యం కానక్కర్లేదు కదా! పోతే 'బూతు పదాలూ', 'సెక్సు సందర్భాలూ' ఉంటే బూతు కథలు అవుతాయా! వాటిని రాసే విధానంలో గదా బూతు ఉంటుంది!

నగ్నముని **'అమలిన శృంగారం'** స్మైల్ **'ఖాళీ సీసాలు'**, **'సముద్రం'**, వడ్డెర చండీదాస్ **'అనుక్షణికం'** వంటి రచనలను బూతు రెచ్చగొట్టే రచనలు అనరు. ఈ సందర్భంలో వాకాటివారూ, పురాణంవారూ స్మైల్‌గారి కథల మీద అన్న అభిప్రాయాన్ని గుర్తు చేసుకుందాం... "ఈయన కథలు చాలా నిస్సంకోచంగా, ధైర్యంగా వ్రాసినట్లుంటాయి. ఇన్హిబిషన్స్ లెక్కచేయని వ్యక్తిత్వం గల రచయిత. కథలలో యధేచ్ఛగా సెక్స్‌ని వాడుతున్నప్పటికీ ఈయన వ్రాసినవి ఎంతమాత్రమూ సెక్స్ కథలు కావు!"

మొదటి మూడు కథలలో సామాన్యాంశం 'మగతనం లోపం - దానిపై ఇతర పాత్రల ప్రవర్తన'గా భావించినవారు: (1) వి.యస్. ప్రకాశరావు (మల్కాపురం) (2) ఎస్. రామమూర్తి (సోంపేట) (3) రవితేజ (గద్వాల). గోటేటి బాలకృష్ణమూర్తి (నార్త్ రిడ్జ్ - అమెరికా)గారి విశ్లేషణ ప్రశంసార్హం.

**నచ్చిన అంశం**

**ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ**

లోకంలో మంచితనం సర్వత్రా ఉందీ, అది ఒక్కోచోట ఒక్కో రూపంలో ప్రదర్శితమవుతుందీ అని ఎస్టాబ్లిష్ చేసే కథ యిది. పవిత్రత, అపవిత్రతల మధ్య ఉన్న సన్నని తెరని తొలగించి - 'వాస్తవం యిలాగ కూడా ఉండొచ్చు సుమా!' అని విప్పి చెప్పే కథ కూడానూ.

ఈ కథలో ఉన్న సౌలభ్యం యేమిటంటే, యిలాంటి థీమ్‌ని తీసుకొని అలాంటి చిన్న నిజాల్ని ఆవిష్కరించడం చాలా తేలిక. చాలామందికి - చాలామంది మగాళ్ళకి "వేశ్యలు" అనే సబ్జెక్ట్ మీద వున్న కుతూహలం దృష్ట్యా, కొందరి విషయాల్లో ఆ సబ్జెక్ట్ మీద సరైన అవగాహన లేని దృష్ట్యా, యీ కథలో వున్న మంచితనంతో, ఉదాత్తతతో తమల్ని తాము ఐడెంటిఫై చేసుకొని, తమ ఈగోని తృప్తిపరచుకుంటారు. ఓసారి అలా తృప్తిపడగానే "ఓహ్... చాలా మంచి కథ" అనిపిస్తుంది. ఇంకో చిన్న గమ్మత్తైన విషయం యేమిటంటే యీ కథ చాలా బాగుంది అనుకున్న మగవాళ్ళలో ముప్పాతిక వంతు మంది తమని తాము సీతతో పోల్చుకుని తృప్తిపడతారు - "ఆ పరిస్థితుల్లో నేనే సీతనైతే నేను కూడా అలాగే చేసేవాణ్ణి / దాన్నీ" అని.

కానీ, "థీమ్"లో ఉన్న సౌలభ్యం బలహీనత కాదు కాబట్టి దాన్ని పక్కకు పెడితే, యిది చాలా మంచి కథ. చక్కగా, సూటిగా, ధైర్యంగా ఉన్న కథనంతో బాటు సన్నివేశాల కూర్పు, పాత్రల ప్రవేశ నిష్క్రమణాదులు కథ మధ్యకి వచ్చేవరకు చక్కటి ఉత్కంఠ కలిగిస్తాయి. కథ మధ్య నుంచి తరువాతంతా దాదాపు రొటీన్ అనిపించినా, పాత్రలు

పలికే డైలాగులు హృదయాన్ని చీల్చుకు వచ్చిన మాటలు లాగా ఉండి, కథ తాలూకు సాదాసీదాతనాన్ని బయట పడనివ్వవు. మొదటి నుంచి చివరి వరకూ చాలా గొప్పగా నడుపుకు వచ్చిన విషయం - కథలో పోషించిన వాతావరణం. తండ్రి దగ్గులూ, బూతులూ, జోగారావు అప్పుడప్పుడూ ప్రవేశించడం... యివన్నీ అలాంటి ప్రదేశాల్లో ఉండే కంగారునీ, అపరాధ భావనకి దోహదం చేసే వాతావరణాన్నీ చాలా చక్కగా ఎత్తి చూపుతాయి. చక్కటి కథనానికి "మెడ వంపులో ఓ నరం ఉబ్బి కానవస్తోంది"; "ఇక్కడికి వచ్చిన వాళ్ళందరికీ తలో పిచ్చీను"; "మనుషుల్లో అపవిత్రులు లేరు - చేసే పనుల్లో అపవిత్రత ఉంటుంది" లాంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

సీత లాంటి వాళ్ళకు మురళి లాంటి వాళ్ళు ఎప్పటికీ చిన్నపిల్లల్లానే కనిపిస్తారు, జోగారావు ఎప్పటికీ రాక్షసుడి లాగానే కనిపించినట్టు. ఆ కారణంగానే సీత, మురళి మీద వాత్సల్యాన్ని చూపగలిగింది. ఆ వాత్సల్యం కారణంగానే... ముఖ్యమైంది అనుభవం కాదూ, ఆత్మస్థైర్యం మాత్రమే అని మురళికి యేం కావాలో, యేం అక్కర్లేదో కూడా తనే నిర్ణయించింది. కావల్సిన ఆ ముఖ్యమైన ఆత్మస్థైర్యాన్ని మాత్రం అతనిలో నింపి.... "ఈ బురదలోకి దిగద్దురా కన్నా" అని తల్లిలాగా బుజ్జగించింది. మురళి మాత్రం, తనకేం కావాలో, తనకేం అక్కర్లేదో, యేది ఎంతవరకు కావాలో తెలీని స్థితిలో, అనవసరమైన చోట అనవసరమైనది ఆశించబోయి...పశ్చాత్తాపం తాలూకు 'తడి బురద'లో, 'బురద బస్సు'లో పడిపోయాడు; పడి.... పోయాడు.

ఇంతటి మంచి కథకీ ఒకే ఒక్క చిన్న లోపం. సీత చివర్లో మదర్ యిన్స్టింక్ చూపించడం కోసం, మొదట్నించీ ఆ పాత్రకి కొంత మెచూరిటీ రంగు పూయడం జరిగింది. ఇలా మెచూరిటీ పూత పూయడం అనేది సహజత్వానికి దగ్గరగా ఉందా లేదా.... అది అలాంటి పాత్రలకి నిజ జీవితంలో నప్పుతుందా లేదా అనేది - అఫ్కోర్స్... ఓ పెద్ద డిబేట్.

కాకపోతే - యిక్కడ యీ సందర్భంలో యిలా జరిగిందీ.. యీ సీత యిలా ప్రవర్తించిందీ అని పర్టిక్యులరైజ్ చేసి చూడగలిగినప్పుడిది నిస్సందేహంగా మంచి కథ

- ఎ.వి.రమణమూర్తి

## ద్వితీయ బహుమతి పొందిన విశ్లేషణలు

కథాప్రహేళిక 'బురద' కథ నేను సైకియాట్రిస్ట్ నవడం వల్లనేమో బాగా నచ్చింది! సరే ఎలాగా అభిప్రాయం వ్రాయమన్నారు కనుక కలం పట్టాను.

మానసిక కారణాల వలన, గతంలో జరిగిన చేదు అనుభవాల వలన, విమర్శల వలన, ఎడోలిసెంట్ ఏజ్‌లో ఎదురయిన అనూహ్య సంఘటనల వలన ఒక యువకుని

సెక్స్ జీవితం (ఆ మాటకొస్తే మొత్తం జీవితం) ఎలా కుంటుబడిపోతుందో, దానిని కథలోని సీత ఏ విధంగా ట్రీట్‌మెంట్ చేసిందో చాలా బాగా చిత్రీకరించారు రచయిత.

భయం భయంగా గదిలోకి అడుగు పెట్టిన మురళి మనసులో పేరుకుపోయిన న్యూనతా భావాన్ని కెథారిసిస్ చేసి సహజమయిన మానసిక, శారీరక స్పందనలని కలుగ చేసిన సీతని నిజానికి 'బురద' అనకూడదు!

ఒక సైకియాట్రిస్ట్‌లా, ఒక సెక్స్ ప్రాబ్లమ్‌ని వైద్యం చేసి ఒక జీవితాన్ని (రెండు జీవితాలనా?!) నిలబెట్టింది.

అయితే కథా యితివృత్తాన్ని బట్టి అలాంటి వాతావరణం వర్ణించవలసిందని అర్థం చేసుకున్నా - మురళి బేగ్‌లోంచి రాములవారి పటం తీసి పూజ చేయడం లాంటివి అసహజంగా వున్నాయి.

కథకి 'బురద' అని కాకుండా 'దేవత' అని పేరు పెట్టినా సరిపోతుందని నా అభిప్రాయం.

- డా. యం.విజయగోపాల్

కళ్ళ ముందు జరుగుతున్న అన్యాయాన్ని నిరాటంకంగా, నిర్భయంగా ప్రతిఘటించడమే నిజమైన మగసిరికి నిదర్శనం. సెక్సు సామర్థ్యపు కొలబద్ద మాత్రమే మగతనాన్ని నిర్ధారించే నిర్ణయాత్మక శక్తి కానేరదనే సందేశంతో 'కథాప్రహేళిక'లో ప్రచురించిన 'బురద' కథ రుజువు చేసింది.

ఈ కథ చదువుతుంటే కళ్ళు కైపెక్కడం, వళ్ళు వేడెక్కటం లాంటి సైడ్‌ఎఫెక్ట్‌లు ఏవీ సంభవించవు. జీవిత వాస్తవికత, నిత్యనైమిత్తిక జీవన పోరాటపు పెనుగులాట ప్రతి లైనులోనూ ప్రస్ఫుటించే శైలితో కథా గమనం సాగడమే అందుకు సాక్ష్యం. అధోజగత్ సహోదరి సీతలో దాగి వున్న హృదయ సంస్కారం, మధ్య తరగతి మామూలు యువకుడు మురళిలో పెల్లుబికిన తెగువ, జోగారావు లంఫిన్ దళారీ చావు తెలివి తేటలు... ఇవన్నీ తెరచి చూడగలిగితే మన మధ్యే సజీవంగా తిరుగుతున్న మనస్తత్వాలతో ఐటెండిపై అవుతాయి.

సీత పాత్ర చిత్రణలో రచయిత ప్రదర్శించిన సంస్కారం, అవకాశం వున్నా హద్దులు దాటని తత్వం కథపై అభిమానాన్ని, రచయితపై గౌరవాన్ని కలిగించాయి.

ఆస్మాతో వేగలేక దేవుడ్ని తిట్టే సీత తండ్రి పాత్ర రచయిత అంతశ్చేతనలో ఆవిర్భవించిన అసంతృప్తిని ఈ పరిస్థితులు ఏ అద్వితీయ శక్తి మార్చలేదన్న కసిని ఆవిష్కరించింది.

బలీయమైన శైలి, చురుగ్గా చెక్కిన కథన శిల్పం రచయిత సాంకేతిక నైపుణ్యాన్ని రుజువు చేశాయి.

"అదేమిటి ఆశించిన 'రసం' ఈ కథ నుంచి అందనే లేదే!?" అనే ఆలోచనను ఆసాంతం మళ్ళించి సమస్య వైపుగా ఆలోచనలో పడేసే ఆశావహ ప్రయత్నం ఈ కథ. నాకు నచ్చిన కథ.

- వల్లూరి తేజస్వి

నచ్చని అంశం

ప్రథమ బహుమతి పొందిన విశ్లేషణ

ఈ కథ నాకు నచ్చలేదు. చాలా పాత చింతకాయ పచ్చడి కథే! ఇలాంటి కథలు గతంలో చాలానే వచ్చాయి. కథాంశం ఒకటే అయినా, కథనం వేరుగా యిలాంటి కథలు గతంలో వచ్చాయి.

ఈ విషయాన్ని గుర్తుంచుకుని రచైత కథలో కొంచం కొత్తదనం చూపితే బాగుండేది. "గుండ్రటి మొహం. చిన్న బొట్టు, చెవిపోగు..." మురళి అమాయకుడని చెప్పకనే తెలిసింది. అసలీ కథల్లో అయినా అమాయకులు ఎప్పుడూ యిలాగే ఎందుకుంటారో! టిప్‌టాప్‌గా ఉన్నా అమాయకులు అయిన వాళ్ళు ఉండరూ! ఎంత అమాయకుడైనా వేశ్య దగ్గరి కొచ్చేటప్పుడు రాములవారి పటం తెచ్చి పూజ చేసుకోవటమేమిటి? పైగా "యిది పవిత్ర కార్య"మని చెప్పటం! సెక్స్ ఎడ్యుకేషన్ గురించి రచనలు ఎక్కువైనాక, చిన్నతనంలో "పెద్దవాళ్ళతో" తెలియక చేసిన తప్పులు జీవితాన్ని నాశనం చేసుకుందుకు దారితీస్తాయని ప్రతి కథలోనూ చెప్తూనే వున్నారు. "సృష్టి జీవ ధర్మం! సమాగమం సృష్టికి మూలం. కనుక సమాగమం పవిత్ర కార్యం" అని పెద్ద మాటలు చక్కగా పరిపక్వ జ్ఞానంతో మాట్లాడే మురళి, "నేను మగాడిని కాదా?" అని నిర్ణయించుకోడమేనా! వీరిని జాగృతం చేయడానికి 'సమరం' లాంటి డాక్టర్లెంత మంది కృషి చేయట్లేదు? ఎన్ని పుస్తకాలు రాయట్లేదు? ఎన్ని పుస్తకాల్లో ప్రశ్నలకు జవాబులివ్వటం లేదు?

అయితే చివర్లో మురళి, జోగారావును చెంప వాయించి బయటకు నెట్టడం, "నువ్వు మగాడివి కాదని ఎవరనగలరురా కన్నా" అని సీత అనటం బాగుంది! సీత తండ్రి "తప్పుడు ముండా కొడకా" అని తిట్టేది దేవుడినని సీత చెప్పటం చిన్న ట్విస్ట్ లేదా జెర్కు! అనారోగ్యం, అందువల్ల కూతురి 'శరీరం' మీద ఆధారపడడం వల్ల రేగిన కసి అలా తిట్టించిందతని చేత!

మొత్తం మీద ఈ కథలో కొత్తదనం లేదు. కొత్త సీసాలో పాత సారా పోసి అందించారు. అందుకే సీసా కొత్తదైనా, నిషా పెరగలేదు! ఇంకొంచెం నాణ్యమైన కథలు 'రచన' నుండి ఆశిస్తున్నాం!

- వి.యల్. సుజాత